బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

ఏఈ ఏకే గోవర్ధన్

చిక్కడపల్లి, డిసెంబర్ 16: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేస్తున్నామని గాంధీనగర్ టీజీఎస్‌పీడీసీఎల్ సబ్ డివిజనల్ ఏఈ ఏకే గోవర్ధన్ తెలిపారు. గాంధీనగర్ ఏఈగా గోవర్ధన్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకలాలంలో చెల్లించాలని అన్నారు. సబ్ డివిజనల్ పరిధిలో ఎక్కడ విద్యుత్ సమస్యలు ఉన్నా గుర్తించి, పరిష్కరించి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారం ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్స్ ఉచిత విద్యుత్ కోసం హర్షులు జీహెచ్‌ఎంలో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సబ్ డివిజన్‌లో కార్యాలయంలో ఉచిత విద్యుత్ కోసం వివరాలను తెలుసుకోవచ్చాని తెలిపారు. సబ్ డివిజనల్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఉంటే 040 2343 3249, 93906 19760లో సంప్రదించాలని సూచించారు.

పైపులైన్ పనులు త్వరితగతిన చేపట్టాలి

బాకారంలో పర్యటిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 16: దాయర మార్కెట్‌లో మంచినీటి పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలు, స్థానికుల ఇబ్బందుల దృష్ట్యా పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. సోమవారం ఆయన జలమండలి డీజీఎం మోహన్ రాజ్, జీహెచ్‌ఎంసీ డీఈ గీతతో కలిసి రాంనగర్ దాయర మార్కెట్‌లో కొనసాగుతున్న పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు సాగుతున్న తీరు, జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పైపులైన్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న రాక్‌ను తొలగించాలని, అన్ని జాగ్రత్తలు తీసుకున్న తరువాత తొలగింపు చేపట్టాల్సిందిగా సూచించారు. అనంతరం భరణి అయిల్ మిల్ వీధిలో పర్యటించిన ఎమ్మెల్యేకు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా స్థానికులు కోరారు. నాలుగు నెలలుగా రోడ్డు తవ్వి వదిలి వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాల్సిందిగా అధికారులను అదేశించారు. దశలవారీగా పెండింగ్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు ముఠా జయసింహ, రాంనగర్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, కొండ శ్రీధర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దాయాల్‌రెడ్డి, కేశపురం అరుణ్, ముదిగొండ మురళి, శివముదిరాజ్, గండు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, డిసెంబర్ 16: వరద ముంపు సమస్య నుంచి గాయత్రీ నగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించనున్నట్టు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం అమీర్‌పేట్ డివిజన్‌లోని గాయత్రీనగర్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కాలనీలోని నాలా ఉప్పొంగి ముంపునకు గురవుతుంది. అప్పట్లో మంత్రిగా ఉన్న సమయంలో ఆ ప్రాంతంలో పర్యటించి శాశ్వత పరిష్కారం కోసం రూ.1.50 కోట్లు మంజూరు చేయించినట్టు తెలిపారు. ఈ నిధులతో 95 మీటర్ల మేర బాక్స్‌డ్రైన్ నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. అందులో 45 మీటర్ల వరకు పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ గాయత్రీనగర్‌లో పర్యటించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వెంటనే ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అంతే కాకుండా నాలాను పూర్తిస్థాయిలో శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ వెంకట నారాయణ, డీఈ వాసుదేవరెడ్డి, ఎస్ఎన్‌డీ డీఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్ర పండుగగా క్రిస్మస్

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తదితరులు

- క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

ముషీరాబాద్: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని క్రిస్టియన్ మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ అనిల్ థామస్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో లాజరస్ మీడియా నెట్ వర్క్స్ వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ ఆర్గనైజేషన్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ముషీరాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ బెటీనా లంక సంయుక్త ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనాథ బాలలు, దివ్యాగులు, వృద్ధులకు క్రిస్మస్ గిఫ్ట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్, అదనపు డీజీపీ బాబురావు, బిషప్ జాన్ పాల్, ఆదామ్‌రాజ్, మీసాల జయకుమార్, కాశీ సతీష్, విజయ్‌కుమార్, దాసరి విజయ్, ప్రసంగి, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి, డిసెంబర్ 16: క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా గుర్తించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. జీసస్ ది డోర్ చర్చి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాశం రవి ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని వాల్మీకినగర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి క్రిస్మస్ పండుగకు కానుకలు అందజేశారని గుర్తుచేశారు. తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీఎస్ లేనియల్, పాస్టర్లు డానీయల్, రాంచదర్, మధు, సమ్యాల్ టేలరో ఆధ్వర్యంలో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, నాయకులు పున్న సత్యనారాయన్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ఆనంద్, కైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకలు పంపిణీ చేసిన క్రిస్టియన్ మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ అనిల్ థామస్

మాజీ ఎమ్మెల్యే గాదరి జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే కిశోర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 16: తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ ఓయూ రథసారథి గాదరి కిశోర్‌కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్వీ నాయకుడు బాలెంల అవినాశ్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అవినాశ్ మాట్లాడుతూ విద్యార్థి నేతగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, ఓయూను ఉద్యమ కేంద్రంగా మార్చిన ఘనత కిశోర్ దని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని చెప్పారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు చందు, జీడీ అనిల్, గణేశ్, అర్జున్, నాగేందర్, పవన్, సాయి, రాఘవ, రామ్, రవితేజ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షకుడు, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జలంధర్‌గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 19వ వార్షికోత్సవం సందర్భంగా విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో సేవలు అందించిన పలువురికి అవార్డులు అందించింది. ఈ క్రమంలో జలంధర్‌గౌడ్‌కు పురస్కారం అందించి సత్కరించారు.

– బేగంపేట్

అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మికత పెంపొందుతుంది


స్వాములతో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, డిసెంబర్ 16: అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మికత పెంపొందుతుందని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. శంకర్ గురు స్వామి ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో సాయిబాబా ఆలయం వద్ద 41 రోజుల పాటు స్వాములకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు. సోమవారం ముఠా జయసింహ హాజరై స్వాములకు అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైందని అన్నారు. భక్తి భావనతో స్వాములకు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్న శంకర్ గురు స్వామిని అభినందించారు. కార్యక్రమంలో గురుస్వామి నవీన్‌నాయుడు, జి.నరేశ్‌నాయుడు, బీఆర్ఎస్ నాయకుడు టెంపుల్ జనార్దన్ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

బేగంపేట్, డిసెంబర్ 16: సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోదర అనుబంధ సంఘాలతో సోమవారం సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర పాల్గొని పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. పేదలకు ఫీజుల పంపిణీ, ఉచిత బియ్యం, ఉచిత వివాహాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మర్యాల జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మకు నటరాజ జీవిత సాఫల్య పురస్కారం

ముషీరాబాద్, డిసెంబర్ 16: వంశీ ఆర్ట్ థియేటర్స్–వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన పద్మమోహన్ ఆంధ్ర నాట్య ప్రదర్శన పలువురిని అకట్టుకుంది. నవ జనార్దన పారిజాతంలోని భామా కలాపం రక్తి కట్టించారు. కార్యక్రమంలో జస్టిస్ మాధవి ముఖ్యఅతిథిగా పాల్గొని పద్మ మోహన్‌కు నటరాజ రామకృష్ణ పేరిట జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర నాట్య కళాకారుడు డాక్టర్ కళాకృష్ణ, పద్మమోహన్, ఉమామహేశ్వరి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మను సత్కరిస్తున్న జస్టిస్ మాధవి

దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16: దొంగతనం చేసేందుకు ఇంట్లోకి ప్రవేశించిన పాత నేరస్థుడిని పట్టుకుని.. కాళ్లు చేతులు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం వివరాల ప్రకారం.. ఎన్ఎఫ్‌సీ నగర్ బీ–1 కాలనీ సమీపంలో ఓ ఇంటి తాళం పగులగొట్టి లోనికి వెళ్లిన కల్వకుర్తికి చెందిన పాత నేరస్థుడు వడ్డెర నరేశ్(35)ను స్థానికులు గమనించి పట్టుకున్నారు. తాళ్లతో చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడు పాత నేరస్థుడని, మహబూబ్‌నగర్ జిల్లాలో 4 దొంగతనం కేసులు ఉన్నాయని, ఇటీవల ద్విచక్రవాహనాన్ని దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. దొంగతనం కేసులు మహబూబ్‌నగర్‌లో ఉన్నందున అక్కడి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, డిసెంబర్ 16: నియోజకవర్గంలోని వారాసిగూడ విశాల్ మార్ట్ ఎదురుగా ఉన్న రోడ్డులో నిరంతరంగా డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని కార్పొరేటర్ హేమకు స్థానికులు ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం అధికారులతో కలిసి ఆప్రాంతంలో కార్పొరేటర్ హేమ పర్యటించారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో గల కారణాన్ని తెలుసుకొని త్వరగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాశ్వతంగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆమె మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టకు భక్తుల తాకిడి

కీసర, డిసెంబర్ 16: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరుడికి భక్తుల తాకిడి నెలకొంది. సోమవారం శివుడికి ఇష్టమైన రోజు కావడంతో శివభక్తులు భారీ ఎత్తున కీసరగుట్టకు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము 3.30గంటల నుంచే భక్తులు భారీగా కీసరగుట్టకు విచ్చేసి గర్భాలయంలోని శ్రీ మూలవిరాట్ స్వామివారికి తేనె, ఆవుపాలు, పంచామృతంతో ప్రత్యేక మహాన్యాస పూర్వ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు కాశీ విశ్వేశ్వరాలయం, శ్రీ నాగదేవత, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వార్లను దర్శించుకున్నారు. కీసరరగుట్టకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం తరపున పూర్తి ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఆలయ ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డిలు తెలిపారు.

రాణి రుద్రమదేవికి ఘన నివాళి

రాణి రుద్రమదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జయసూర్య, జనార్దనమూర్తి, తదితరులు

ముషీరాబాద్, డిసెంబర్ 16: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా సోమవారం వీరనారి రాణి రుద్రమదేవి సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు జయసూర్య ముఖ్యఅతిథిగా పాల్గొని రాణి రుద్రమదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాకతీయుల వంశంలో ఒక ధృవతారగా వెలిగిన మహారాణి రుద్రమదేవి అని కొనియాడారు. కాకతీయుల వంశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టిన వీరవనితని పేర్కొన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిరువాణి చంద్రశేఖర్, గరిమెళ్ల సీత, గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

హోమియో కళాశాల మైదానంలో క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు

రామంతాపూర్,డిసెంబర్ 16 : వైద్యవిద్యార్థులు వైద్య విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు అన్నారు. సోమవారం కళాశాల మైదానంలో కళాశాల 57వ వార్షికోత్సవంలో భాగంగా క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య విద్యార్థుల్లో ఫిజికల్ ఫిట్‌నెస్, క్రమశిక్షణకోసం క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఉత్సాహంతో క్రీడల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. ఈనెల 30న కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి సంవత్సరం కళాశాల వార్షికోత్సవంలో భాగంగా క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ మూర్తి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ పార్థసారథి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

అంబర్‌పేట, డిసెంబర్ 16: ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నల్లకుంట డివిజన్‌లోని చారీలేన్‌లో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ వై. అమృతతో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. బస్తీలు, కాలనీల్లో రోడ్లు, మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, పార్కుల అభివృద్ధి చేపట్టామని తెలిపారు. ఇంకా చాలా చోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు కొత్తగా ప్రతిపాదనలు కూడా తయారు చేయడం జరిగిందన్నారు. అనంతరం బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. బస్తీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చా రు. అలాగే సీసీ కెమెరాలు పని చేయడం లేదని, వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సీసీ కెమెరాలను మరమ్మతులు చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రశాంతి, బీఆర్ఎస్ నాయకులు రమణానాయుడు, అనిల్‌కుమార్, బీజేపీ నాయకులు మధుయాదవ్, శ్రావణ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

రామంతాపూర్, డిసెంబర్ 16: రవాణారంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిం ది. ఉప్పల్, రామంతాపూర్ ప్రాంతాల్లో ఆటోట్రాలీ, డీసీఎం డైవ ర్ల సమస్యలను సోమవారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ట్రాలీ, ఆటో డ్రైవర్లపై ఆర్‌టీఏ అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కాం గ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలన్నారు. వారికి 2 బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలన్నారు. 2019 మోటార్ వాహనాల చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉప్పల్ కార్యదర్శి జె. వెంకన్న, వెంకటేశ్, ఎల్లయ్య, పర్వతాలు, దరశథ్, నర్సింహ, యాదగిరి, పాండు, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తితోనే విజయాలు సొంతం

జవహర్‌నగర్, డిసెంబర్ 16: మేధో సంపత్తితోనే విజయాలు సొంతమవుతాయని, అంకితభావంతో సేవ చేస్తేనే సంపూర్ణ మానసిక స్థైర్యం లభిస్తుందని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ దీపక్ వర్మ అన్నారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో 29వ ఇంటర్ కాఫ్ డిబేట్ న్యూఢిల్లీలోని అటల్ అక్షయ ఊర్జా భవన్‌లో దేశంలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సాయుధ బలగాలకు ఇటీవల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ హైదారాబాద్ గ్రూప్ నుంచి సాయుధ బలగాలు పాల్గొని ప్రత్యేక ప్రతిభ కనబర్చి ట్రోఫిని సాధించారు. మానవ హక్కుల సమస్యలపై అవగాహనలో ప్రతిభ కనబర్చి ఎస్సై రాహుల్, అసిస్టెంట్ కమాండెంట్ కన్హా జోషి విజయం సాధించారు. హిందీ, ఆంగ్లభాషలో అసిస్టెంట్ కమాండెంట్‌లు అక్షయ్ బడోలా, భాస్కర్ చౌదరి 2, 3 స్థానాల్లో గెలుపొందారు. సీఐఎస్ఎఫ్ కమాండోలు వివిధ పోటీల్లో పాల్గొని ట్రోఫిలను సాధించడం అనందంగా ఉందని దీపక్ వర్మ తెలిపారు.



కుట్టు మిషన్ల.. పథకానికి దరఖాస్తులు

అబిడ్స్, డిసెంబర్ 16 : మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. నాంపల్లి లోని మైనార్టీ ఫైనాన్స్ కార్యాలయంలో ఇందిరమ్మ మహిళా శక్తి–కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని ఆయన కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ కాంతి వెస్లీతో కలిసి ప్రారంభించారు. మైనార్టీ మహిళలు (tgobmms. cgg. gov.in)లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సోమవారం నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని ఈ నెల 31వ తేదీ లోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.